

పీజీ సెట్ తుదివిడత సీట్ల కేటాయింపు

ఎచ్చెర్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలల్లోని పీజీ కోర్సుల్లో తుదివిడత సీట్ల కేటాయింపు వివరాలను సెట్ కన్వీనర్ సోమవారం ప్రకటించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో 10 ఆర్ట్స్ కోర్సులు, 9 సైన్స్ కోర్సులున్నాయి. ఈ కోర్సుల్లో మొత్తం 600 సీట్లు ఉండగా 253 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది ప్రారంభించిన పీలాసఫీలో ఒక్కరు మాత్రమే అడ్మిషన్ పొందారు. జియాలజీ, జియో ఫిజిక్స్‌లో ఒక్కరూ కూడా చేరలేదు. ఎంజేఎంసీలో ఇద్దరు, సోషల్ వర్క్‌లో 4, అర్థశాస్త్రంలో ఏడుగురు మాత్రమే అడ్మిషన్ పొందినట్లు వర్సిటీ వర్గాల బోగట్టా.

ధాన్యం రైతులకు భరోసా

- విక్రయించిన ఐదారు గంటల్లోనే బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ
- పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాలశాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్, అధికారులు

శ్రీకాకుళం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు సహాయం, భరోసా, నమ్మకం కలిగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ధాన్యం కొనుగోలు చేసిన కేవలం 5 నుంచి ఆరు గంటల్లోనే వారి ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామ'ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలో ఉత్తరాంధ్రలో ఆరు జిల్లాలకు సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లాపరిషత్ కార్యాలయంలో రైస్ మిల్లర్లు, వివిధ రైతు సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు.. శాఖలో సాంకేతికతతో కూడిన సంస్కరణలను చేపడుతున్నామని తెలిపారు. రైస్‌మిల్లర్ల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు.



సమావేశానికి హాజరైన మిల్లర్లు, రైతులు

యాభై లక్షల టన్నుల కొనుగోళ్లతో..

విలేకరులతో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. 'ఖరీఫ్ సీజన్‌లో 50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి చరిత్ర సృష్టించబోతున్నాం. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలలో గతంలో 11.45 లక్షల టన్నులు కొనుగోలు చేయగా.. ఈ సారి లక్ష్యాన్ని 13 లక్షల టన్నులకు పెంచాం. గతంలో కొనుగోళ్లు మిల్లుకే పరిమితమయ్యాయి. కానీ మా ప్రభుత్వం రైతులకు నమ్మకమున్నచోట ధాన్యం విక్రయించే వెసులుబాటును తీసుకువచ్చింది. నూరుశాతం రాయితీపై టార్పాలిన్‌లను అందజేస్తాం. ఉత్తరాంధ్రలో వారం రోజుల్లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. రైస్‌మిల్లర్ల కోసం ఈ ఏడాది 1:2 నిష్పత్తిలో బ్యాంకు గ్యారెంటీలను తీసుకుంటామ'ని చెప్పారు.

- 'అకాల వర్షాలతో రైతులు తక్కువ ధరకే ధాన్యం అమ్మాల్సిన పరిస్థితి లేకుండా కనీస మద్దతు ధర కల్పిస్తాం. రాష్ట్రంలో 41వేల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, 400కు పైగా వసతిగృహాలలో మంచి బియ్యంతో నాణ్యమైన భోజనాన్ని అందించడం కూటమి ప్రభుత్వానికి (మిగతా 6వ పేజీలో..)

తూకంలో మోసం.. అలసత్వంపై హెచ్చరిక

'ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు పునరావృతం అయితే ఉపేక్షించేది లేద'ని రైస్‌మిల్లర్లను, అధికారులను మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. రైతుల వద్ద 80కిలోల తూకం ఉన్నచోట 75 కేజీలుగా నమోదు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని.. వారికి అన్యాయం చేయొద్దని స్పష్టం చేశారు. తేమ శాతం పరీక్షల్లో ఏకరూపత కోసం రైతుసేవా కేంద్రాలు, రైస్‌మిల్లుల వద్ద ఒకే కంపెనీకి చెందిన యంత్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

జిల్లాలో బలమైన నాయకత్వం అవసరం ● జనసేన పార్టీ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ 6లో

పాఠశాలలకు కొత్త కళ

- విధుల్లో చేరిన 528 మంది నూతనోపాధ్యాయులు

మెళియాపుట్టి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు కొత్త కళ వచ్చింది. సోమవారం జిల్లావ్యాప్తంగా 528 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఎస్జీటీలు 122 మంది, స్కూల్ అసిస్టెంట్లు 325 మంది, గిరిజన సంక్షేమ పాఠశాలలకు 81 మంది ఉపాధ్యాయులను విద్యాశాఖ కేటాయించింది. వీరికి శ్రీకాకుళంలో ఈ నెల 3 నుంచి 10 వరకు విద్యారంగంలో మార్పులు, బోధన పద్ధతులు, సాంకేతికత వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఆన్‌లైన్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించారు. లీప్ యాప్‌లోనే వారికి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయా ఉపాధ్యాయులంతా సోమవారం తమకు కేటాయించిన పాఠశాలలకు చేరుకోవడంతో కొత్త కళ కనిపించింది. తమ కష్టం ఫలించి.. ప్రభుత్వ కొలువు దక్కడంతో ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లివిరిసింది. మరోవైపు ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో మరింత మెరుగైన బోధన సాగనుందని విద్యార్థులు, తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమైంది.

పెద్దమడి గురుకులంలో 14 మంది..

మెళియాపుట్టి మండలంలోని పెద్దమడి గురుకుల పాఠశాలలో గత 30 ఏళ్ల నుంచి రెగ్యులర్ ఉపాధ్యాయులు లేరు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించి బోధన సాగించేవారు. ఈ పాఠశాలలో 377 మంది విద్యార్థులు చదువుతున్నారు. సోమవారం ఈ ఒక్క పాఠశాలలోనే 14 మంది కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. దీంతో పాఠశాలకు కొత్త కళ సంతరించుకుని.. విద్యార్థుల్లో సంతోషం వ్యక్తమైంది.

మరిన్ని వివరాలు 6లో



పెద్దమడి గురుకుల పాఠశాలలో బోధిస్తున్న కొత్త ఉపాధ్యాయుడు

గ్రేడ్-1 కార్యదర్శులకు పదోన్నతి

నరసన్నపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న గ్రేడ్-1 కార్యదర్శులకు కూటమి ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ఇటీవల పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. డీపీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ జి.ప్రసాదరావు, జిల్లాపరిషత్ సీనియర్ అసిస్టెంట్ ఎల్.శ్రీనివాసరావుకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించారు. అలాగే సింగుపురం, కొర్ని, కోటబొమ్మాళి, జీఆర్ పురం గ్రేడ్-1 కార్యదర్శులు ఎ.రమేష్, ఎల్.అప్పన్న, జె.హరికృష్ణ, జి.ప్రసాదరావును కూడా డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమించారు. అనకాపల్లి జిల్లా నుంచి కె.లక్ష్మణరావును పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా జిల్లాకు కేటాయించారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి ● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ 6లో

రోడ్డుపైకి పిచ్చిమొక్కలు.. రాకపోకలకు బేజారు 8లో

ఇవి సమస్యల కాంప్లెక్స్‌లు

- శిథిలమైన మరుగుదొడ్లు ● అలంకారప్రాయంగా కుర్చీలు
- పనిచేయని తాగునీటి కుళాయిలు ● వర్షం పడితే చుట్టూ నీరే
- అరకొర సౌకర్యాలతో ప్రయాణికులకు ఇక్కట్లు



పలాస కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో పాడైన రహదారి

శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో ప్రయాణికుల మధ్య సేదతీరుతున్న శునకాలు

అరసవల్లి/ నరసన్నపేట/ పలాస/ ఇచ్ఛాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువవుతున్నాయి. పాడైన తాగునీటి కుళాయిలు, శిథిలావస్థలో మరుగుదొడ్లు, కూర్చోవడానికి వీల్లేకుండా విరిగిన కుర్చీలు.. తిరగని ఫ్యాన్లతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు వర్షం పడితే చాలు.. కాంప్లెక్స్ ఆవరణ చుట్టూ నీరు నిలిచి.. మురుగు కంపుతో నరకయాతన పడుతున్నారు.

- జిల్లాకేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కాంప్లెక్స్ ఆవరణలో రోడ్లు పాడైపోయాయి. మురుగునీరు, చెత్తతో అపరిశుభ్రంగా మారింది. వర్షం కురిస్తే కాంప్లెక్స్ ఆవరణ చుట్టూ అడుగున్నరకుపైగా నీరు నిలిచిపోతుంది. కాలువల్లో మురుగునీరు సైతం వరద నీటితో కలిసి ప్రయాణికులకు మరింత ఇబ్బంది కలుగజేస్తోంది. కాంప్లెక్స్ ఆవరణలో చాలా కుర్చీలు, ఫ్యాన్లు పాడైపోయాయి. మరుగుదొడ్లు శుభ్రంగా లేవు. ప్రయాణికుల మధ్యనే శునకాలు తిరుగుతూ.. సేదతీరుతున్నాయి. ఔట్‌గేటు వద్ద వ్యాపారులు బళ్లపై పండ్లు విక్రయించడంతో బస్సులు రాకపోకల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- శ్రీకాకుళం తర్వాత నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ నిత్యం ప్రయాణికులతో కళకళలాడుతుంది. ఈ కాంప్లెక్స్ నుంచి విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ వంటి ప్రాంతాలతోపాటు (మిగతా 6వ పేజీలో..)



నరసన్నపేట కాంప్లెక్స్‌లో కుర్చీలు పాడైపోవడంతో.. అధిక శాతం మంది నిల్చున్న ప్రయాణికులు



ఇచ్ఛాపురం కాంప్లెక్స్‌లో కూర్చునేందుకు కానరాని కుర్చీలు

ఎంపీడీవో ఆఫీసు ఎదుట వైసీపీ నాయకుడి చిందులు

- టీడీపీ నాయకులను ఉద్దేశించి దుర్భాషలాడిన వైనం
- ఇరువర్గాల మధ్య వాగ్వాదం.. పోలీసుల జోక్యం

సరుబుజ్జిలి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం ఓ వైసీపీ నాయకుడు చిందులు వేశారు. టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులను దుర్భాషలాడారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఆ సమయంలో ఎమ్మెల్యే రవికుమార్ కూడా అక్కడే ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ అధికారులతో సమావేశమయ్యారు. గ్రామ సచివాలయ భవనాలు, ఆర్‌ఎస్‌కే భవనాలు పూర్తి చేయాలని పీఆర్ ఏఈ కూర్మనాథరావును ఆదేశించారు. ఇసుకలపాలెం పంచాయతీలో అసంపూర్తిగా ఉన్న భవనాలను సర్పంచ్ పల్లి సురేష్ ద్వారా నిర్మాణాలు చేపడితే బాగుంటుందని ఏఈ ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. గతంలో ఆ భవన నిర్మాణాలు చేపట్టిన వైసీపీ నాయకుడు బద్రి రామారావు గ్రామ పంచాయతీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందని సర్పంచ్ సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వ్యక్తిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంతో పాటు వివిధ శాఖల అధికారులు ప్రత్యేకంగా కూర్చోబెట్టుకుని కాలం గడుపుతున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే రవికుమార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం ఫిర్యాదులతో అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసీపీ నాయకుడు బద్రి రామారావును ప్రోత్సహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో సమీపంలో ఉన్న వైసీపీ నాయకుడు బద్రి రామారావు చిందులు వేశా రు. అక్కడే ఉన్న టీడీపీ నాయకులపై నోరు పారేసుకున్నారు. ఎమ్మెల్యేని ఉద్దేశించి కూడా 'బయటకు రా' అన్నారు. దీంతో టీడీపీ నాయకులు, వైసీపీ నాయకుడి మధ్య తోపులాట జరిగింది. ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా సదరు వైసీపీ నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐ హైమవతి సిబ్బందితో వచ్చి ఇరువర్గాలను అదుపు చేశారు.



ఇరువర్గాలను అదుపు చేస్తున్న పోలీసులు

ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల నుంచి మిల్లులకు తరలించే వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ పరికరం అమర్చుకోవాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 'ధాన్యం రవాణా వాహనాల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. జీపీఎస్ కోసం ఆసక్తిగల వాహనదారులు ముందుగా రూ.3068(జీఎస్టీతో) కలిపి చెల్లించాలి. జీపీఎస్ అమర్చుకోవాలి. జీపీఎస్ అమర్చిన తరువాతే ఆయా మండలాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద వాహనాల వివరాలను నమోదు చేసుకోవాలి. అటువంటి వాహనాలకు మాత్రమే ప్రభుత్వం రవాణా ఖర్చులను చెల్లిస్తుంద'ని జేసీ తెలిపారు.

గ్రామీణ బ్యాంకు సేవల్లో అంతరాయం

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ బ్యాంకుల సేవల్లో సోమవారం కూడా అంతరాయం కొనసాగింది. విలీన ప్రక్రియ నేపథ్యంలో మూడు రోజుల పాటు మాత్రమే సేవల్లో అంతరాయం కలుగుతుందని బ్యాంకు యాజమాన్యం ప్రకటించింది. కానీ నాల్గోరోజు సోమవారం కూడా సేవలు అందుబాటులోకి రాలేదు. దీంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా యూపీఐ సేవలు లేక గ్రామీణ ప్రాంత ఖాతాదారులు ఆందోళనకు గురయ్యారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 57 గ్రామీణ బ్యాంకు శాఖల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. అనేక గ్రామీణ బ్యాంకుల్లో పది లావాదేవీలు కూడా జరగకపోవడంతో ఖాతాదారులు నిరాశగా వెనుదిరిగారు. ఈ విషయమై రీజినల్ మేనేజర్ లావేటి అనంతరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా అటువంటి సమస్యలు తన దృష్టికి రాలేదని, ఎటువంటి ఇబ్బందులు ఉత్పన్నం కాలేదని చెప్పారు.

అవగాహనతోనే జీఎస్టీ ప్రయోజనాలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ● వారోత్సవాలు ప్రారంభం

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ప్రయోజనాలపై వినియోగదారులకు అవగాహన తప్పనిసరి అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మునిసిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'ఈ ఎగ్జిబిషన్ ద్వారా జీఎస్టీ 2.0 ప్రయోజనాలను అర్థమయ్యేలా వివరిస్తాం. ప్రతీ స్టాల్‌లో తప్పనిసరిగా జీఎస్టీ ద్వారా తగ్గిన వస్తువుల ధరల వివరాలను ప్రదర్శించాలి. తగ్గింపు ఎలక్ట్రానిక్స్, మొబైల్ ఫోన్లు, కిచెన్ వస్తువులు, కంప్యూటర్లు, ఏసీలు, టీవీలు ఇలా వివిధ వస్తువులన్నీ ఒకేచోట లభిస్తాయి. పొందూరు చేనేత వస్త్రాలు, హస్తకళల ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రజలంతా నాణ్యమైన వస్తువులను కొత్త జీఎస్టీ తగ్గింపు ధరల్లో కొనుగోలు చేయాల'ని కోరారు. అనంతరం స్వాతీసోమనాథ్ బృందంచే నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గురువులు వచ్చిన వేళ

● విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు సోమవారం జిల్లాలోని వివిధ పాఠశాలల్లో విధుల్లో చేరారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అవకాశం రావడంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగం రావడానికి కారణమైన ప్రభుత్వానికి ఓ వైపు కృతజ్ఞతలు చెబుతూనే... మరోవైపు అంకితభావంతో విధులు నిర్వహిస్తామని... ఇది ఎంతో సంతోషకరకమైన సమయమని ఆనందం వ్యక్తం చేశారు.


కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

మరువలేని రోజు..



మెళియాపుట్టి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయినిగా ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉంది. కొత్త బంగారు లోకంలోకి అడుగు పెట్టినట్లుగా ఉంది. నా జీవితంలో ఇది మరువలేని రోజు.

-కె.హారతి, సైన్స్ ఉపాధ్యాయురాలు, పెద్దమడి గురుకులం

పగలు పనిచేస్తూ.. రాత్రి చదువుతూ



మాది కవిటి. ఉన్నత చదువులు చదువుకున్నా. ఎక్కడా ఉపాధి లేక పోవడంతో బెంగళూరులోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తూనే చదువుకున్నాను. పగలు ఉద్యోగం చేస్తూ.. రాత్రి వేళల్లో చదువుకొని ఉద్యోగం సాధించాను. కూటమి ప్రభుత్వం నాకు జీవితాన్ని ఇచ్చింది.

-బాలకృష్ణ, జీవశాస్త్రం ఉపాధ్యాయుడు, పెద్దమడి

చాలా ఆనందంగా ఉంది..



మాది కింతలి. నేను ఇప్పటి వరకు సంతబొమ్మాళి కేజీబీవీలో పని చేశాను. డీఎస్సీలో ఎంపికై పూర్తి స్థాయిలో ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టడం చాలా ఆనందంగా ఉంది.

-సాయికల్యాణి, గణితం, పెద్దమడి

ఎంతో సంతోషంగా ఉంది..



రణస్థలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రణస్థలం జెడ్పీ హైస్కూల్‌లో లెక్కలు మాస్టారుగా బాధ్యతలు చేపట్టడం చాలా ఆనందంగా ఉంది. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చినప్పుడే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దండిగా ఉంటాయి. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో డీఎస్సీ ఊసే లేదు. ఉపాధి లేక చాలా ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు.

-పప్పల భాస్కరరావు

కంచిలిలో...


నూతన ఉపాధ్యాయులు..

కంచిలి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): 2025 మెగా డీఎస్సీ ద్వారా నియమితు లైన 34 మంది నూతన ఉపాధ్యాయులు సోమవారం వివిధ పాఠశాలల్లో విధుల్లో చేరారని ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. నూతన ఉపాధ్యాయులను వారు అభినందించారు.

పన్నెండేళ్ల కల నెరవేరింది..



నరసన్నపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పుష్కర కాలం కల నెరవేరిందని.. దీనికోసం ఎన్నో రాత్రులు.. పగళ్లు కష్టపడ్డానని నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్‌గా నియమితులైన మట్ట ఈశ్వరరావు తెలిపారు. సారవకోట మండలం తొగిరి గ్రామానికి చెందిన ఆయన సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ నరసన్నపేటలో ఇంటర్‌మీడియట్ చదివే రోజుల్లో ఉపాధ్యాయునిగా చేరాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఇంటర్ తరువాత డైట్‌లో శిక్షణ పొంది.. రెండు పర్యాయాలు డీఎస్సీ రాసినా అవకాశం రాలేదన్నారు. తాజాగా మెగా డీఎస్సీలో పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్టీటీగా ఎంపికయ్యా నని తెలిపారు. మన జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా ఎంపికవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈశ్వరరరావు తండ్రి ప్రసాదరావు సన్నకారు రైతు. తనకు ఉద్యోగం రావడంతో తండ్రి ఆశయం నెరవేరిందని ఈశ్వరరావు చెప్పారు.

తండ్రి కలను నెరవేర్చా..



హరిపురం, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): సోంపేట మండలం బుసాభద్ర గ్రామానికి చెందిన నా తల్లిదండ్రులు సవరయ్య, మోహినమ్మ. వారు దినసరి కూలీలు. మేము ముగ్గురం అక్కాచెల్లెళ్లం. నేను పెద్ద కుమార్తెను. ముగ్గురమూ ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్నాం. మా నాన్న మమ్మల్ని ఉపాధ్యాయులుగా చూడాలనుకున్నారు. కష్టపడి చదివాం. ముగ్గురికీ సచివాలయ ఉద్యోగాలు వచ్చాయి. డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా ఎంపికై నాన్న కల నెరవేర్చాను. కానీ నా తండ్రి ఆరు నెలల కిందట చనిపోయారు. నా తండ్రి కల నెరవేరినందుకు ఆనందంగా ఉంది. నా భర్త కృష్ణారావు సైతం ఉపాధ్యాయుడే.

-పల్లి కుమారి, గణిత ఉపాధ్యాయురాలు, పట్టులోగాం ఆశ్రమ పాఠశాల

తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలం..



మాది సోంపేట మండలం తాళ్లభద్ర. నా తల్లిదండ్రులు నెహ్రూ, దమయంతిల కృషి వల్లే ఈ రోజు ఉపాధ్యాయుడినయ్యాను. తండ్రి రోజువారీ కూలీ చేసి నన్ను చదివించారు. తల్లి మానసిక వికలాంగురాలు. అయినా సరే నా ఉన్నతికి పాటుపడ్డారు. నన్ను ప్రోత్సహించడంలో నా భార్య పూజ కృషిని మరువలేను. నా తండ్రి నన్ను ఉపాధ్యాయుడిగా చూడాలనుకున్నారు. అందుకు తగ్గట్టుగా ప్రణాళికా పరంగా చదివి విజయం సాధించా. తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలం లభించింది. అందుకు నాకు చాలా సంతోషంగా ఉంది.

-వట్టికుళ్ల తులసీరావు, ఆంగ్ల ఉపాధ్యాయుడు, పట్టులోగాం ఆశ్రమ పాఠశాల

కవిటిలో...

కవిటి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కవిటి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. కవిటి మండలంలో 126 పోస్టులు ఖాళీగా ఉండగా.. 85 మంది విధుల్లో చేరారని ఎంఈఓ-1 ధనుంజయ మజ్జి తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ 16, ఒరియా మీడియంలో 8 మంది చేరారు. మిగిలిన వారంతా ఉన్నత పాఠశాలల్లో విధుల్లో చేరారని తెలిపారు. వీరంతా మండల విద్యావనరుల కేంద్రం వద్ద జాయినింగ్ రిపోర్టులు అందించారని చెప్పారు. ఎంఈఓ ధనుంజయ మజ్జి, ఎస్.రామకృష్ణలు వీరిని అభినందించారు. వీరికి ఉపాధ్యాయ యూనియన్ల నేతలు స్వాగతం పలికారు.


కవిటి మండలంలో విధుల్లో చేరిన టీచర్లు

విధుల్లోకి నూతన ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విధుల్లో చేరిన 16 మంది ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా పరిశీలకులు పుల్లట రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

జిల్లాలో బలమైన నాయకత్వం అవసరం

● జనసేన నాయకుల సమావేశంలో మంత్రి నాదెండ్ల

శ్రీకాకుళం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రశ్నించే పార్టీగా ఉన్న జనసేన.. ఇప్పుడు ప్రజలకు సేవచేసే విధంగా మారింది. ఇప్పుడు జిల్లాలో బలమైన నాయకత్వాన్ని తయారు చేయాలి' అని ఆ పార్టీ నాయకుడు, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ 'ఉత్తరాంధ్రలో జనసేన నాయకులు, కార్యకర్తలు నిజాయతీ, పట్టుదలతో పాటు నాయకత్వంపై విశ్వాసం ఉంచిన వారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్న పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మాటలను స్ఫూర్తిగా తీసుకున్న గొప్ప కార్యకర్తలు. జిల్లాలో తితలీ తుపాను సమయంలో బెండిగేటు, నువ్వులరేవు, పలాసలో పవన్ కల్యాణ్, నేను పర్యటించాం. కార్యకర్తలు వెంట ఉండి నడిపించారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని దేశవ్యాప్తంగా చూస్తున్నారు. తెలుగుజాతి కోసం అంకిత భావంతో పని చేస్తున్నాం. ప్రశ్నించే పార్టీ కాస్త.. ప్రజలకు పనులు చేసే పార్టీగా జనసేన ఎదిగింది. ఎన్నో కష్టాలు అనుభవించాం. ఆ భరోసా, ధైర్యం కార్యకర్తలే ఇచ్చారు. వ్యక్తిగత విమర్శలకు తావులేకుండా.. గత పాలకుల్లా బూతులు లేకుండా ... పవన్‌కల్యాణ్‌లా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదర్శంగా పనిచేయాలి. 2019లో రెండు చోట్లా ఓటమి చెందినా నిరుత్సాహ పడకుండా కార్యకర్తలు అధినాయకుడికి ముందుండి నడిచారు. కార్యకర్తలు పదవులు ఆశించడంలో తప్పులేదు. నామినేషన్ వేసేందుకు కూడా భయపడే సమయంలో ఇక్కడ ఓ ఎమ్పీటీసీ స్థానాన్ని గెలుచుకున్నాం. అప్పట్లో టీడీపీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు భయపడింది. గెలుస్తామా లేదా అని కాదు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దామన్న నినాదంతో స్థానిక ఎన్నికల్లో జనసేన పోటీ చేసింది. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిలో ఉన్నాం. మనం బాధ్యతగా ఉండాలి. కూటమిగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. 25 కిలోల బియ్యం కాదు.. 25ఏళ్ల భవిష్యత్ అన్నదే పార్టీ ఆలోచన. వైసీపీ దుర్మార్గంగా పాలన అందించింది. సంక్షేమం పేరుతో బూటకంగా బటన్ నొక్కి అభివృద్ధిపై దృష్టి సారించలేదు. మనం వ్యక్తిగతంగా వెళ్లొద్దు..ప్రజాసమస్యలను గుర్తించి సమష్టిగా వెళ్లండి. 15 ఏళ్ల వరకు కూటమి ఉంటుందని మన నాయకుడు అన్నారు. పదవుల కోసం కాదు. రాష్ట్ర భవిష్యత్ కోసం ఇదంతా. కూటమిలో ఉంటూ అభివృద్ధి, సంక్షేమం రెండూ ప్రజలకు అందించాలి. స్వార్థంతో ఆలోచించొద్దు. పార్టీ కోసం శ్రమించే ప్రతిఒక్కరిని గౌరవించండి. సిద్ధాంతాలకు నిలబడి సభ్యత్వాలు చేసిన వారికి విలువనివ్వండి. అధికారులను తప్పుబట్టలేం. గతంలో కొంతమంది చేతిలోనే రాజకీయాలు ఉండేవి. యువతను రానిచ్చేవారు కాదు. రాబోయే స్థానిక ఎన్నికల్లో యువతకు అవకాశం ఇస్తాం. గత ప్రభుత్వ హయాంలో నమోదైన కేసుల విషయంలో న్యాయపోరాటం చేద్దాం. రాష్ట్ర వ్యాప్తంగా వివరాలు తెప్పించుకుందాం. మూడు పార్టీల నాయకులు కలసిమెలసి వెళ్లేలా ప్రణాళికలు వేస్తున్నాం. సోషల్‌మీడియా వేదికగా ఎవరినీ దూషించొద్దు' అని సూచించారు. కొంతమంది కార్యకర్తలు, నాయకులు మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యేలు తమను పట్టించుకోవట్లేదని.. అక్కడికి వెళితే పనులు కావడం లేదని.. సీట్ల పర్సంటేజీ ప్రకారం పదవులు కేటాయించాలని మంత్రి నాదెండ్ల దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా జనసేన అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, వివిధ నియోజకవర్గా నాయకులు విశ్వక్సేన్, దుర్గారావు, చైతన్య, సర్వేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 92 వినతులను స్వీకరించారు. వినతుల స్వీకరణకు ముందుగా ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

మా భూములను ఇప్పించండి..

'2001లో టీడీపీ ప్రభుత్వం దూసి గ్రామ సమీపంలో 27 దళిత కుటుంబాల వారికి భూములిచ్చింది. అప్పటి నుంచి ఆ భూముల్లో జీడి, మామిడి, వరి, ఇతర పంటలు వేసుకుంటూ జీవిస్తున్నాం. గడిచిన నాలుగు సంవత్సరాలుగా మా భూములను బీసీ కులానికి చెందిన పెద్దలు ఆక్రమించుకున్నారు' అంటూ 17 కుటుంబాలకు చెందిన వారు సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ భూములను తిరిగి ఇప్పించి, న్యాయం చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు.

రోడ్డున పడ్డాం.. ఆదుకోండి

'22 ఏళ్లుగా ఆరోగ్య సహాయకులుగా విధులు నిర్వహించాం. దురదృష్టవశాత్తూ ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డాం. సుప్రీం కోర్టులో మమ్మల్ని మరలా ఉద్యోగంలోకి తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఇందుకు సంబంధించి నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కానీ నేటివరకు ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయలేదు. 50 ఏళ్లు దాటిన వారు చాలామంది గత 10 నెలలుగా ఉద్యోగాలు లేక కుటుంబాలతో రోడ్డున పడ్డారు. ఈ వయస్సులో వేరే ఉద్యోగం రాక, ఏం చేయాలో తెలియక ఆవేదనతో ఆరుగురు హెల్త్ అసిస్టెంట్లు మరణించారు. దయచేసి మాకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాల'ని వారు కలెక్టర్‌కు విన్నవించారు.


ఆక్రమణకు గురైన భూములు ఇప్పించాలని కోరుతున్న దళితులు


ఇచ్ఛాపురం కాంప్లెక్స్ ఆవరణలో చిలిచిన వర్షపునీరు

ఇవి సమస్యల కాంప్లెక్స్‌లు

(ఐదో పేజీ తరువాయి)

జిల్లాలో రూరల్ ప్రాంతాలకు కూడా అధిక సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రోజుకు సరాసరి 2వేల మంది ప్రయాణిస్తుంటారు. కాగా కాంప్లెక్స్‌లో చాలా కుర్చీలు పాడై.. కూర్చోవడానికి వీల్లేకుండా పోయాయి. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం కురిస్తే మరుగుదొడ్ల పైనుంచి నీరు కారుతుంది. పురుషుల మరుగుదొడ్లకు తలుపులు ఊడిపోయాయి. తాగునీటి కుళాయి వద్ద అపారిశుధ్యం కనిపిస్తోంది. ఇక షాపుల్లో ఎక్కువగా నాన్ బ్రాండ్ శీతల పానీయాలు అధిక ధరకు విక్రయించి ప్రయాణికులను దోచుకుంటున్నారు. ఇటీవల ఆర్టీసీ ఆవరణలో దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు నిల్చోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది.

● పలాస ఆర్టీసీ కాంప్లెక్స్‌లోనూ మౌలిక సదుపాయాలు లేవు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేక దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతం. కాంప్లెక్స్ ఆవరణ చుట్టూ అపారిశుధ్యమే. ఇటీవల కురిసిన వర్షానికి వరదనీరు చేరడంతో కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పలాస కన్నా.. కాశీబుగ్గలోని మునిసిపల్ బస్ కాంప్లెక్స్ నుంచే అధిక సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. పలాస కాంప్లెక్స్‌ను ఆధునికీకరించి.. సౌకర్యాలు కల్పిస్తే ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

● ఇచ్ఛాపురం కాంప్లెక్స్‌లో ప్రయాణికులు కూర్చొనేందుకు కుర్చీలు కానీ, తాగేందుకు నీటి సౌకర్యం కానీ లేదు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా పట్టించుకునేవారు లేరు. కాంప్లెక్స్ చుట్టూ ప్రహరీ లేక.. ముళ్లపొదలతో నిండిపోయింది. కాంప్లెక్స్ ఆవరణలో రోడ్డు గతుకులమయంగా దర్శనమిస్తోంది. ప్రధానంగా వర్షాలు పడితే.. నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం వర్షం కురవగా.. కాంప్లెక్స్‌లో ఆవరణలో వరదనీటితో అవస్థలు పడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. కాంప్లెక్స్‌ల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్నారు.


శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో పాడైన తాగునీటి ట్యాప్‌లు

సౌకర్యాలు కల్పించాలి..



నరసన్నపేట నుంచి ఇతర ప్రాంతాలకు తరుచూ ప్రయాణిస్తాం. కాంప్లెక్స్‌లో కనీస సౌకర్యాలు సరిగా లేవు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. తాగునీటి వ్యవస్థ బాగా లేదు. బస్సులు వచ్చే సమాచారం తెలిపే మైకులు లేవు. వర్షం కురిసే సమయంలో మరింత ఇబ్బందులు పడుతున్నాం. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి.

-శ్రీకాంత్, సంతబొమ్మాళి

కుర్చీలు ఏర్పాటు చేయాలి..



నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మరుగుదొడ్లు సరిగా పనిచేయవు. వర్షంపడితే పై నుంచి నీరు కారుతుంది. బస్సులు వచ్చేవరకు కూర్చొనేందుకు కుర్చీలు ఏర్పాటు చేయాలి.

-లీలారాణి, ఉపాధ్యాయురాలు

కూలి కోసం.. కూటి కోసం!

● ప్రమాదకరంగా ప్రయాణం

కోటబొమ్మాళి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వాహనంలో కిక్కిరిసి...కూర్చోవడానికి చోటు లేకున్నా ప్రాణాలు పణంగా పెట్టి వెళ్తున్న వీరంతా కోటబొమ్మాళి మండల కేంద్రంలో సిమ్మెంట్ పని చేసుకొనే కూలీలు. సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన వీరంతా కోటబొమ్మాళి మండల కేంద్రంలోని రైస్‌మిల్లుల్లోను, భవన నిర్మాణ కార్మికులుగాను పని చేస్తుంటారు. నిత్యం వందలాది మంది కూలీలు ఇలానే ఆటోలు, ఇతర వాహనాలపై ప్రమాదకర రీతిలో ప్రయాణం చేస్తుంటారు. గుంతల దారుల్లో ఏ మాత్రం పట్టు తప్పినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఇలా ప్రయాణాలు సాగిస్తున్నారు. సోమవారం కొత్తపల్లి నుంచి కోటబొమ్మాళి వచ్చే రహదారిలో ఆటోలో కూలీలు ప్రమాదకరంగా వెళ్తుండగా కొంతమంది తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆటోల్లో పరిమితికి మించి కూలీలను ఎక్కించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కొత్తపల్లి- కోటబొమ్మాళి రహదారిలో ఆటోలో ఇలా..

గూటికి పోదాం చలో చలో..



అరసవల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు పడమటి కొండల్లోకి చేరిపోవడానికి సిద్ధమవుతున్నాడు. సాయం సంధ్య చీకట్లు లోకాన్ని కమ్ముకునే సమయం దగ్గర పడుతోంది. ఆకాశం పసిడి వర్ణ కాంతులతో తళుకులీనే వేళ... పక్షులు గుంపులుగా గూటికి పయనం కట్టాయి. ఈ సుందర దృశ్యం సోమవారం సాయంత్రం నాగావళి నదీ తీరంలో కనువిందు చేసింది.

ధాన్యం రైతులకు భరోసా

(ఐదో పేజీ తరువాయి)

మరింత ప్రతిష్టను, సంతృప్తిని ఇస్తోంది. ఇది ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒకటిగా నిలుస్తోందని మంత్రి తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్, చైర్మన్, ఎండీ మన్‌జీర్ జిలానీ సమూన్, డైరెక్టర్ గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, కౌలు రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 50 వినతుల స్వీకరణ



సమస్యలు తెలుసుకుంటున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో 50 వినతులు స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏఎస్పీ పి.శ్రీనివాసరావు వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ..పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తెలిపి తక్షణం తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వ్యసనాల బారిన పడవద్దని డీఎస్పీ వివేకానంద అన్నారు. ఏఐవైఎఫ్ శ్రీకాకుళం జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక సన్ డిగ్రీ, పీజీ కళాశాల ఆడిటోరియంలో సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్ పొందాలన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొజ్జాడ యుగంధర్, పరుచూరి రాజేంద్ర మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాటం చేయడమే కాకుండా పలు అంశాలపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సన్ విద్యా సంస్థల చైర్మన్ జయరాం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్‌కుమార్, కొన్న శ్రీనివాసరావు, నగర కన్వీనర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివుని విగ్రహం ప్రతిష్ఠ



ప్రతిష్ఠ జరిగిన శివుని భారీ విగ్రహం

ఇచ్ఛాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బాహుదా నదిలో నూతనంగా ఏర్పాటు చేసిన శివుని భారీ విగ్రహ ప్రతిష్ఠ సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామికి జలాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. ప్రత్యేక దీపారాధన, హోమాలు, కుంకుమార్చనలు చేపట్టారు. శివుని విగ్రహాన్ని చూసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

శాలిహుండం ట్రస్టు భూమి ఆక్రమణపై ఫిర్యాదు

పొందూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 241 సర్వే నెంబరులో ఉన్న శాలిహుండాం ట్రస్టు భూమి ఆక్రమణపై సోమవారం పొందూరు రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ట్రస్టు చైర్మన్ మధురెడ్డి తెలిపారు. రాపాక-పొందూరు రోడ్డుకు ఆనుకుని శాలిహుండాం ట్రస్టుకు 89 సెంట్ల స్థలం ఉండగా ఎటువంటి లీజు అనుమతులు లేకుండా సుమారు 50 సెంట్ల భూమిని పొందూరు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి జేసీబీతో చదును చేస్తుండడంతో సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుద్యోగ భృతి హామీ ఏమైంది?

● ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్ర

అరసవల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు భృతి ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర ప్రశ్నించారు. సోమవారం సంఘ సమావేశం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా నేటికీ నిరుద్యోగ భృతిపై ఏమీ మాట్లాడడం లేదని అన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో 3.80 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి నిరుద్యోగుల తెలియజేసేందుకు గాను ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు 'నిరుద్యోగి ఆవేదన యాత్ర' నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్, కోన శ్రీనివాస్, బొత్స సంతోష్, పట్టణ కన్వీనర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

22 మద్యం సీసాలు స్వాధీనం

లావేరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గుమడాంలో మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న గంధవరపు రమణను సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. అక్రమంగా ఉంచిన 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

జీఎస్టీపై అవగాహనకు సోమవారం జిల్లాలో సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు పాల్గొని జీఎస్టీ 2.0పై వివరించారు. అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ధరల బోర్డులు వేలాడదీయాలి: శిరీష



పలాస: జీఎస్‌టీ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తగ్గిన జీఎస్టీ ధరలపై సంబంధిత షాపుల వద్ద బోర్డులు వేలాడదీయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. సోమవారం మునిసిపల్ కార్యాలయం నుంచి కాశీబుగ్గ పెట్రోల్ బంకు ఐలవ్‌యు పలాస బొమ్మ వరకు జీఎస్‌టీ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో మెప్మా, సచివాలయం, మునిసిపల్ సిబ్బందితో పాటు ట్రేడర్లతో అవగాహన కార్యక్రమం జరిగింది. మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, దువ్వాడ శ్రీకాంత్, జోగ మల్లి పాల్గొన్నారు.

సామాన్య, మధ్య తరగతికి మేలు: శంకర్



అరసవల్లి: బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవిల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు సామాన, మధ్యతరగతి వారికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వాణిజ్య, పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన మార్గాల్లో సోమవారం జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహనకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13 నుంచి 19 వరకు ప్రజలకు జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించేందుకు ఎన్టీఆర్ మునిసిపల్ మైదానంలో ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, కార్మికశాఖ, హోల్‌సేల్ వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ఊరట: రవికుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ 2.0లో పన్నుల తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట లభించిందని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కింజరాపు వెంకటరమణ, మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి, ఎంపీడీవో రోణంకి వెంకటరావు, తహసీల్దార్ ఎస్.రాంబాబు, వ్యాపారులు, స్వయం సహాయ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త జీఎస్టీపై చైతన్యం

జి.సిగడాం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీపై క్షేత్ర స్థాయిలో చైతన్యం అవసరమని టీడీపీ, బీజేపీ మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణ అధ్యక్షతన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వదేశీ వస్తువుల కొనుగోలుపై చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, నాయకులు ముద్దాడ గౌరి, కూనుబిల్లి కూర్మారావు, ముద్దాడ త్రినాథరావు, మజ్జి కన్నం నాయుడు, శిరుగుడి గోవిందరావు, ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జి.సిగడాం: బైక్ ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు, అధికారులు

ఉద్యోగ కల్పనకు ప్రభుత్వం చర్యలు

అరసవల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్‌లో మహిళా విభాగంలో ట్రైనీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే గొండు శంకర్ సోమవారం తన కార్యాలయంలో కాల్‌లెటర్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో టాటా ప్రాజెక్టు కోఆర్డినేటర్ సంతోష్‌కుమార్, నైపుణ్య శిక్షణ అధికారి వి.రఘురాం తదితరులు పాల్గొన్నారు.

జడ్ఆర్‌యూసీసీ సభ్యుడికి అభినందన

జి.సిగడాం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌కోస్టు రైల్వే జోనల్ వినియోగదారుల సలహా సంఘం సభ్యుడిగా నియమితులైన బాలబొమ్మ వెంకటేశ్వరరావును మండల కూటమి నాయకులు సోమవారం సత్కరించారు. ఆయన జి.సిగడాం, బాతువ రైల్వే స్టేషన్‌లను సందర్శించిన సందర్భంగా ఆయా స్టేషన్ల అధికారులతో కలిసి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, మండల ప్రధాన కార్యదర్శి కురిరెళ్ల బుజ్జి, పీఏసీఎస్ అధ్యక్షుడు బెవర జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఉపాధ్యక్షుడికి...

ఎచ్చెర్ల ఏఎంసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన బీజేపీ సీనియర్ నాయకుడు బూరాడ వెంకటరమణను సోమవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) సత్కరించి అభినందించారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైల విష్ణుమూర్తి, వజ్జిపర్తి రఘురాం, పండూరి అప్పారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో భారీ వర్షం

ఇచ్ఛాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో సోమవారం భారీ వర్షం కురిసింది. వేకువ జామునుంచే కుండపోత వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాలువల్లో మురికినీరు రోడ్లపై పారింది. ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. భారీ వర్షానికి ఆర్టీసీ కాంప్లెక్స్‌చుట్టూ నీరు చేరింది. దీంతో ప్రయాణికులు కాంప్లెక్స్‌లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. కాంప్లెక్స్ ఆవరణ అంతా గోతులుగా ఉండడంతో నీరు నిలిచిపోతోంది.

● సోంపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సోంపేట పరిధిలో సోమవారం వేకువ జామున భారీ వర్షం కురిసింది. ఈ వర్షం రైతులకు ఎంతగానో మేలు చేస్తోందని రైతులు అభిప్రాయపడుతున్నారు. వర్షానికి చెరువులు నిండాయి.

ఉద్యోగుల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

● వాడీవేడిగా మండల సమావేశం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయ, పశువైద్యశాఖల అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో టీడీపీ, వైసీపీ ప్రజాప్రతి నిధులతో పాటు జడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు ఎరువుల పంపిణీ, భూములు సర్వే విషయం, పంటకు దోమపోటుపై గ్రామాల్లో అవగాహన కలిగించలేదన్నారు. తెలికిపెంట గ్రామ పంచాయతీ ఎల్‌పీఎం అగ్రహారంలో యాదవులకు చెందిన గొర్రెలకు వ్యాధి సోకి పశు వైద్యం కోసం మండల పశువైద్య శాఖ ఏడీకి ఫోన్ చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో 25 గొర్రెలు మృతి చెందాయని టీడీపీ సభ్యుడు నందివాడ గోవిందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014- 2019లో రైతులు గోకులం నిర్మాణాలకు ధరావత్తు కట్టినా డబ్బులు తిరిగి చెల్లించలేదని పశువైద్యశాఖాధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఇసుకలపాలెం సర్పంచ్ పల్లి సురేష్ సమావేశంలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కలుగజేసుకుని మాట్లాడుతూ.. రైతుల కష్టంపై నిర్లక్ష్యం వహిస్తే క్షమించనని, భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిషత్, జడ్పీ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య కొంతసేపు వాదోపవాదాలు జరిగిన రసాభాసగా మారడంతో ఎస్ఐ బి.హైమావతి సిబ్బందితో వచ్చి పరిస్థితిని అదుపు చేశారు. అలాగే వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.పావని, ఏవో మన్మథరావు, తహసీల్దార్ ఎల్.మధు సూదన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణ అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి తదితరులు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బాలికా సంరక్షణ అందరి బాధ్యత అని డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో అధికారులతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ బాలికా దినోత్సవ సందర్భంగా బాలికలు, స్త్రీలకు ఉన్న హక్కులు, బాధ్యలపై అవగాహన కలిగించాలన్నారు. ఉప కలెక్టర్ పద్మావతి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. పొగాకు వినియోగం వల్ల కలిగే నష్టాలను తెలియజేసే పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.అనిత, డీసీహెచ్ఎస్ డా.కల్యాణ బాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్థానిక వికాస్ పాఠశాలలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలవల్ల బాలికల ఆరోగ్యం పూర్తిగా పాడయ్యే అవకాశం ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవా లన్నారు. కార్యక్రమంలో న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, పాఠశాల డైరెక్టర్ కె.వేణుగోపాల్, కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు తెలుసుకోవాలి

రణస్థలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెప్పలవలస ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. బాలికల హక్కులు, బాధ్యతలను హెచ్ఎం జయదేవి వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే చైర్‌పర్సన్ సుగ్గు కామేశ్వరి, సెక్రటరీ బల్ల రాజేశ్వరి, పీఈటీ దాలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ సక్రమంగా జరగాలి

కవిటి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు రెండోవిడత పుస్తకాల పంపిణీ సక్రమంగా చేపట్టాలని ఏపీటీఎఫ్ (1938) ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంఈవో ధనుంజయ మజ్జికి వినతిపత్రం అందించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మేరకు పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు బి.ధర్మారావు, ప్రతినిధులు ఎస్.రాజబాబు, ఎం.గోపి, శ్రీరామమూర్తి బిసాయి, భార్గవ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నకిలీ మద్యాన్ని అరికట్టాలి

ఇచ్ఛాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టి మద్యం దందాపై సీబీఐతో దర్యాప్తు చేపట్టాలని మాజీ స్పీకర్, వైసీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం అన్నారు. నకిలీ మద్యం తయారీ, సరఫరాకి వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి సోమవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైసీపీ నేత పిరియా సాయిరాజ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యానికి వ్యతిరేకంగా ర్యాలీ

రణస్థలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల బయటపడిన కల్తీ మద్యానికి వ్యతిరేకంగా సోమవారం వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నేతృత్వంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎక్సైజ్ సీఐ ఎల్.అనూరాధకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

బీచ్ అభివృద్ధికి కృషి చేయండి



మంత్రి నాదెండ్లని కలిసిన జనార్దన్

గార, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కె.మత్స్యలేశం (పోర్ట్ కళింగపట్నం)లోని బీచ్ అభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ నాయకుడు, కెప్టెన్ మైలపల్లి జనార్దనరావు కోరారు. ఈ మేర కు రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను శ్రీకాకుళం జడ్పీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఎంతో ప్రసిద్ధి కలిగిన బీచ్ అభివృద్ధికి పూర్వ వైభవం తీసుకురావాలని ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జనార్దన్ తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ

గార, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కళింగపట్నం పీహెచ్‌సీని సోమవారం సాయంత్రం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ చీఫ్ సెక్రటరీ సౌరబ్‌గౌర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

ఇంటింటికి జనసేన

కవిటి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇద్దివానిపాలెం గ్రామంలో సోమవారం ఇంటింటికి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని బైపల్లి దాలయ్య అన్నారు. కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


ఉమామహేశ్వరరావు (ఫైల్)

పొందూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాజీపేట (రెడ్డిపేట)లో సోమవారం విద్యుదాఘాతంతో జాడ ఉమామహేశ్వరరావు(38) మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. జాడపేటకు చెందిన ఉమామహేశ్వరరావు 13 ఏళ్ల కిందట పుల్లాజీపేటకు చెందిన నాగమణిని వివాహం చేసుకుని పుల్లాజీపేటలోనే ఎలక్ట్రీషియన్‌గా స్థిరపడ్డాడు. సోమవారం గ్రామంలో పి.సుబ్బారావు ఇంట్లో గ్రీజర్ మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు కుమార్తె ఉంది. ఉమామహేశ్వరరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ కలాసీ..

పోలాకి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లపాడుకు చెందిన ఓ వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ జి.రంజిత్ కథనం మేరకు.. రాళ్లపాడుకు చెందిన బోరసీలం (49) నరసన్నపేటలో కలాసీగా పనిచేస్తున్నాడు. ఇటీవల పంటపొలంలో నీలం పనిచేస్తున్న సమయం లో ఈదురుగాలులు వీచాయి. ఈ క్రమంలో గ్రామానికి చెందిన నీలంపై తాటి చెట్టుపడడంతో గాయాలయ్యాయి. దీంతో చికిత్సనిమిత్తం శ్రీకాకుళం తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. నీలానికి భార్య లక్ష్మి,కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ..

ఇచ్ఛాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాయితారి గ్రామానికి చెందిన బారికాని బెహరా (52) సోమవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. బారికాని బెహరా ఒడిశాకు చెందిన తన అల్లుడు మహేశ్వర బెహరాతో కలిసి బైక్‌పై ఆదివారం రాత్రి అరకబద్ర గ్రామంలో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. అక్కడి నుంచి వస్తూ అర్ధరాత్రి సమయంలో బైక్‌పైనుంచి ఆమె పడి తీవ్ర గాయాలపాలైంది. దీంతో ఇచ్ఛాపురం సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించడంతో బరంపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతిచెందింది. మృతురాలి కుమారుడు హరిశ్చంద్ర బెహరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వై.తిరుపతిరావు తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్లపై కేసు

శ్రీకాకుళం క్రైం,అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):పేకాట ఆడుతూ ఆదివారం రాత్రి పట్టుబడిన ఆరుగురు వ్యక్తులపై శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదుచేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.20,275 నగదు స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. నగరంలోని మండల వీధిలో ఓఇంటిలో పేకాటఆడుతున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు వారు దాడిచేయగా గుడ్ల సర్వజి, గుడ్లశ్రీధర్, పొట్నూరు సత్యం, సాయికుమార్, కోరాడనాగరాజు, అంధవరపు రవికుమార్‌ను పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పజెప్పారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

మాణిక్యపురంలో ఐదుగురు ...

కవిటి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మాణిక్యపురంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంమేరకు సోమవారం దాడిచేసి ఐదుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. గ్రామంలోని శివాలయం ఎదురుగా పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.10,620 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న వ్యాన్

నందిగాం/టెక్కలి,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): నర్సిపురం జంక్షన్ సమీప జాతీయరహదారి ఆదివారం అర్ధరాత్రి ఆగిఉన్న లారీని వ్యాన్ ఢీకొన్న సంఘటనలో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఇచ్ఛాపురం మండలంలోని ఈదుపురం, ధర్మపురం గ్రామాలకు చెందిన తొమ్మిది మంది రాయగడ మజ్జిగౌరమ్మ దర్శించుకొని తిరిగి వస్తున్నారు. నర్సిపురం జంక్షన్ సమీపంలో నిలిపిఉన్న లారీని వారు ప్రయాణిస్తున్న వాహనం ఢీకొంది. దీంతో పిట్ట చంద్రయ్య, రాధమ్మ, ధర్మారావు, డ్రైవర్ ఈశ్వరరావుతో పాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. వీరిని టెక్కలి ఆసుపత్రికి తరలించారు. బాధితుడు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్‌ఆలీ కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై సోమవారం శ్రీకాకుళం టూటౌన్ పోలీసులుకేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కళింగపట్నానికి చెందిన వనుము సంతోషి(21)కి విజయవాడకు చెందిన బత్తుల వెంకటేష్‌తో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. వీరి మధ్య తరచూ కలహాల వల్ల తల్లి సూరమ్మ ఆరు నెలల కిందట సంతోషిని తన ఇంటికి తీసుకువచ్చేసింది. ఈనెల 8న విజయనగరంలో బంధువుల ఇంటిలో జరిగిన పైడితల్లి అమ్మవారి పండగలకు వెళ్లేందుకు కుమార్తెను శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కించి తిరిగి ఇంటికి వెళ్లిపోయింది. ఆరోజు నుంచి కుమార్తె ఆచూకీ లభించకపోవడంతో బంధువుల ఇళ్లు, ఆమె భర్త ఇంటిలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు టూటౌన్ సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఎఫ్ఏ-2 పరీక్షలు

నరసన్నపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన ప్రశ్నపత్రాలతోనే ఎఫ్ఏ-2 పరీక్షలను నిర్వహించాలని ఎంఈవో ఉప్పాడశాంతారావు సూచించారు. నరసన్నపేటలోని ప్రైవేటు పాఠశాలల్లో ఎఫ్ఏ-2 పరీక్షలను నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించడం లేదన్న ఫిర్యాదు మేరకు పరిశీలించారు.

తైక్వాండోలో సత్తాచాటిన టెక్కలి క్రీడాకారులు

టెక్కలి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఎన్టీఆర్ క్రీడాకేంద్రానికి చెందిన తైక్వాండో క్రీడాకారులు ఈనెల 10, 11, 12 తేదీల్లో బాపట్లలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన 69 రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తాచాటారు. అండర్-14బాలికల విభాగంలో మెండ తపస్వి 35కిలోల విభాగంలో స్వర్ణపతకం గెలుచుకుని నవంబరులో పంజాబ్‌లోని లుథియానాలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హతను సాధించింది. జనపాన అక్షయ 38 కిలోల విభాగంలో రజిత బాలుర విభాగంలో అట్టాడ మహీధర్ నాయుడు 38కిలోల విభాగంలో రజిత, వేము లవాడ వినయ్ అండర్ 41కిలోల విభాగంలో రజితపతకం సాధించారు.విద్యార్థులను జిల్లా క్రీడావిభాగ అధికారి కల్లేపల్లి శ్రీధర్ కోచ్ శేఖర్ అభినందించారు.

గట్కాపోటీలో నరసన్నపేట విద్యార్థులు..

నరసన్నపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని పలు పాఠశాలలకుచెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో గట్కాపోటీల్లో సత్తాచాటారు. చత్తీస్‌ఘడ్‌లోని దుర్గ్‌లో ఈనెల పది నుంచి 12వ తేదీ వరకూ జరిగిన గట్కా పోటీల్లో అండర్ -14 విభాగంలో సత్యవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాఘవ, శరత్, చైతన్య, పుష్పరాజ్‌లు కాంస్యపతకాలను సాధించారు. అలాగే బోర్డు పాఠశాలకు చెందిన కీర్తిక కాంస్యపతకం, నరసన్నపేటలో వివిధ కళాశాలలో చదువుతున్న కృష్ణ, వంశీ, హర్షలు అండర్-17విభాగంలో సిల్వర్‌మెడల్ సాధించారు.ప్రతిభ కనపరిచిన విద్యార్థులను సత్యవరం పాఠశాల హెచ్ఎం వకులారత్నమాల అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పెద్దమడి విద్యార్థులు ఎంపిక

మెళియాపుట్టి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ ఎంపికల్లో సత్తాచాటిన పెద్దమడి గురుకుల కళాశాలకు చెందిన ఇద్దరి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ లక్ష్మనాయుడు తెలిపారు.కృపాసింధు లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లో ప్రథమ, బి.గోవింద్ 110 మీటర్ల హార్డిక్స్‌లో ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడంపై ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్ లక్ష్మనాయుడు, రామానంద్, పీడీ లక్ష్మణరావు, అధ్యాపకులు అభినందించారు.


కేదారిపురం నుంచి పెదంచల వెళ్లే మార్గంలో ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం

రోడ్డుపైకి పిచ్చిమొక్కలు.. రాకపోకలకు బేజారు

● కేదారిపురం - పెదంచల రోడ్డులో జంగిల్ క్లియరెన్స్‌కు నోచుకోక తరచూ ప్రమాదాలు

పలాసరూరల్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): పలాస నుంచి కేదారిపురం మీదుగా పెదంచల వ్రైళ్లే రహదారిలో కనీస జంగిల్ క్లియరెన్స్‌కు నోచుకోవడం లేదు. కేదారిపురం నుంచి పెదంచల వరకూ ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిరోడ్డుపైకి చేరడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఈ మార్గంలో ఏడు కిలోమీటర్ల రహదారిలో ఎక్కువ మలుపులు ఉండడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చీకటిపడిన తర్వాత వచ్చే ఆటోవాలాలు, ద్విచక్రవాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ప్రతి ఏటా జంగిల్‌క్లియరెన్స్ చేయాల్సిఉన్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వర్షాకాలంలో పిచ్చిమొక్కలు పెరిగి రోడ్డుపైకి వచ్చిఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడంలేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే రాష్ట్రాభివృద్ధి

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



చల్లవానిపేటలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంతోనే దేశంతో పాటు రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. సోమవారం చల్లవానిపేట గ్రామ సచివాలయంలో ఎనిమిదో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు, అంతర్జాతీయ బాలిక దినోత్సవం వారోత్సవాలు పురస్కరించుకొని పోషణవిలువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం పౌష్టికాహారంపై ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పోషణ వారోత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడడానికి ప్రతి ఒక్కరు సమతుల్యమైన ఆహారం తీసుకోవాలన్నారు కార్యక్రమంలో సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సీహెచ్ వంశీప్రియ, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, టీడీపీ మండలాధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు దుంగ స్వామిబాబు, తర్ర బలరాం, కింజరాపు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐదు లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి


మాట్లాడుతున్న కలమట వెంకటరమణమూర్తి

కొత్తూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ముందుచూపుతో సీఎం దూసుకుపోతున్నారని, రానున్నరోజుల్లో యువతకు ఉపాధిఅవకాశాలు అపారంగా పెరగనున్నాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి తెలిపారు. సీఎంచంద్రబాబునాయుడు దూరదృష్టితో ప్రణాళికంగా సాఫ్ట్‌వేర్ కంపెనీలు రాష్ట్రానికి తీసుకువస్తున్నారని చెప్పారు. సోమవారం కొత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ గూగుల్ వంటి కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయంటే ముందుతరాలవారికి ప్రపంచస్థాయి అవకాశాలు వస్తున్నట్టేనని తెలిపారు.విశాఖపట్నం ఏఐ సిటీగా మారితే ఏపీ దేశానికి డిజిటల్ ఇండియాలో మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు.సమావేశంలో టీడీపీ నాయకులు గేదెల జగన్మోహనరావు, కర్రి అప్పారావు, రేగేటి వెంకటరమణ, వాసు పాల్గొన్నారు.

ఖద్దరు వస్త్రాలపై అవగాహన

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):ఎల్.ఎన్.పేట మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం స్వదేశంలో తయారవుతున్న ఖద్దరు వస్త్రాల వినియోగంపై అవగాహనకలిగించారు.ఈసందర్భంగా ఎంపీడీవో పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం స్వదేశీ వస్త్రాలతోపాటు స్వదేశీ వస్తువులు వినియోగించుకొని విదేశీవస్తువుల వాడకాన్ని తగ్గించుకోవాలన్న సంకల్పంతో జీఎస్టీ అమలుచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

● నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటాం: టీడీపీ నాయకులు

పలాస, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):కల్తీ మద్యం జరుగుతోందని నిరూపిస్తే తాము శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకోవడమే కాకుండా సంబంధిత షాపుల యజమానులతో గుండు కొట్టించుకుంటామని, లేకుంటే మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆ పని చేయగలరా అని టీడీపీ నాయకులు సవాల్ విసిరారు. కల్తీమద్యంపై మాట్లాడేహక్కు వైసీపీకి లేదని ఎద్దేవాచేశారు.సోమవారం పలాసలో ఏపీట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు,ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పట్టణాధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్పనవీన్, ఎం.నరేంద్ర(చిన్ని), జోగమల్లేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. అప్పలరాజు తెలిసీతెలియని మాటలు ఆడుతున్నారని, కల్తీ అనేది వైసీపీ నుంచి పుట్టుకొచ్చిందని, తెలిపారు.ఐదేళ్లలో నాసిరకం మద్యం అమ్మి ప్రజల ప్రాణాలు హరించారని, వారికి కల్తీపై మాట్లాడే హక్కు లేదన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆమె భర్తపై నిందలు వేయడం తగదని పేర్కొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

టెక్కలి/సంతబొమ్మాళి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలంలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు ముంపునకు గురై పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కోత మధుసూదనరావు కోరారు.ఈ మేరకు సోమవారం టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ సంతబొమ్మాళి మండలంలోని పలుప్రాంతాలతోపాటు కాకరాపల్లి తంపర ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుమారు ఆరువేల ఎకరాల వరిపంట ముంపునకు గురయ్యిందని తెలిపారు. మూలపేట పోర్టుకోసం నిర్మించిన రైల్వేరోడ్ రాజపురంవద్ద తంపరలో అడ్డంగా నిర్మించిన రోడ్‌వల్ల ముంపునకు గురైందని తెలిపారు. ముంపు కారణంగా ఉండే అడ్డంకులను తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వడ్డితాండ్ర-రావివలస ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులుచేయాలని కోరారు. రావివలస ఈ రహదారిలో ఉందని, కార్తీక మాసంలో శివాలయం సందర్శనకు వేలాది మంది భక్తులు రానున్న దృష్ట్యా మరమ్మతులు చేయాలని కోరారు.


టెక్కలి ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మహానగరంగా విశాఖ


మాట్లాడుతున్న గోవిందరావు

పాతపట్నం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గూగుల్ వంటి సంస్థల రాకతో సైబరాబాద్‌గా విశాఖమహానగరం అవతరించనుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. సోమవారం స్థానిక క్యాంపుకార్యాలయంలో టీడీపీశ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముందుచూపుతో వ్యవహరిస్తూ తీసుకొన్న నిర్ణయాల వల్ల విశాఖలో 87,500 కోట్లపెట్టుబడితోడేటాసెంటర్ ఏర్పాటుకానుందన్నారు. తొలుత కళింగవైశ్యసంఘ నాయకులతో మాట్లాడుతూ సంఘసంక్షే మానికి రూ.ఐదు లక్షలు సహాయంగా అందజేస్తానని ప్రకటించారు.

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పోలాకి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దీర్ఘాశి దుర్గాకాలనీలో మంగళవారం ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు మండల సమావేశం

కొత్తూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన సమావేశం జరగనుందని ఎంపీడీవో వి.నీరజ ఒక ప్రకటనలో తెలిపారు. గతసమావేశంలో సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలు, ప్రశ్నలకు పూర్తి సమాచారంతో సమావేశానికి ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

26న చదరంగం పోటీలు

టెక్కలి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో ఈనెల 26న జిల్లా స్థాయి స్కూల్స్ చాంపియన్స్ ట్రోఫీ చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా చెస్ ఇన్ స్కూల్స్ కమిటీ సభ్యులు సనపల భీమారావు తెలిపారు. సోమవారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ పోటీల్లో ప్రభుత్వప్రైవేటుపాఠశాల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

నవంబరు 9న బాలియాత్ర

జలుమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):శ్రీముఖలింగంలో నవంబరు తొమ్మిదో తేదీన బాలియాత్ర నిర్వహించనున్నారు.ఈ మేరకు నిర్వహణ కమిటీ సభ్యులు సోమవారం నరసన్నపేట, ఆమదాలవలస ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తికి, కూన రవికుమార్‌కు ఆహ్వానించారు. కళింగ సామ్రాజ్య పూర్వ ఆచారమైన బాలియాత్రకు పూర్వవైభవం తీసుకురాడానికి సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. బాలియాత్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కరుకోల హరిప్రసాద్, జలుమూరు ఏఎంసీ అధ్యక్షుడు తర్ర బలరాం, కమిటీ సభ్యులు జనార్దనరావు, శ్రీనివాసరావు, రమణమూర్తి, గుంట సింహాచలం, ఎస్. వెంకటాచలం పాల్గొన్నారు.


హరిపురం: చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న మహిళలు


జలుమూరు: సారవకోటలో సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న వీవోఏలు

మూడేళ్ల కాలపరిమితి రద్దుపై హర్షం

● మందసలో సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేసిన వీవోఏలు

హరిపురం, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి):వీవోఏలకు గత ప్రభుత్వం విధించిన మూడేళ్ల కాలపరిమితిని రద్దుచేయడంపై డ్వాక్రా మహిళలు, వీవోఏలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మందసలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి డ్వాక్రా మహిళలు సోమవారం పాలభిషేకం చేశారు. అనంతరం మందసలో వెలుగు కార్యాలయంలో ఏపీఎం పైడికూర్మారావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరక్టర్ బావనదుర్యోధన, మందస పీఏసీఎస్ అధ్యక్షులు తమిరి భాస్కరరావు, రాజాన మహేష్, గార కృష్ణారావు, గువ్వాడ లక్ష్మీనారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

●జలుమూరు, (సారవకోట) అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సారవకోట వెలుగు కార్యాలయంలో వీవోఏలు ఆ సంఘ మండలాధ్యక్షురాలు జి.అనూరాధ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలఅభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ హయాంలో వీవోఏల నియామకం మూడేళ్ల కాల పరిమితి విధించి వారిని రెన్యువల్ చేయకపోతే తొలగించి వారికి అనుకూలమైన వారికి నియమించుకొనేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వం జీవోని రద్దుచేసి ఆదుకుంటామని హామీ ఇచ్చి మాటనిలబెట్టుకుందని చెప్పారు.

ఎక్సైజ్ కార్యాలయాల వద్ద నిరసన

జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లోగల ఎక్సైజ్ కార్యాలయాల వద్ద సోమవారం వైసీపీ నాయకులు ఆ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు నిరసన తెలిపారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

●కాశీబుగ్గ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం, బెల్ట్ దుకాణాలు, అదనపు వసూళ్లను నిరసిస్తూ వైసీపీ శ్రేణులు మాజీమంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో కాశీబుగ్గలోనిరసన తెలిపి,మానవహారం నిర్వహించాయి.కాశీబుగ్గలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామచంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

● నరసన్నపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):నరసన్నపేట ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఇటీవల బయటపడిన అక్రమ మద్యంపై సీబీఐతో విచారణ చేపట్టాలని పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య డిమాండ్ చేశారు.

●టెక్కలి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యంతో పేదల జీవితాలు బలవుతున్నాయని టెక్కలి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త పేడాడ తిలక్ విమర్శించారు. టెక్కలిలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి పాల్గొన్నారు.

●పాతపట్నం అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):మద్యం కల్తీ నియంత్రణలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోందని మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి ఆరోపించారు. పాతపట్నంలో ఎక్సైజ్ కార్యాలయంవద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆ శాఖ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలి

కొత్తూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని వైసీపీ నాయకులకు టీడీపీ నాయకులు హితువు పలికారు. సోమవారం కొత్తూరులో టీడీపీ మండలాధ్యక్షుడు అగతముడి మాధవరావుతో పాటు ఆ పార్టీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులపై దాడులు చేసేంది గత వైసీపీ ప్రభుత్వంహయాంలోనే తప్ప, కూటమి ప్రభుత్వ పాలనలో కాదని పేర్కొన్నారు. కొత్తూరు తహసీల్దార్, వెలుగు ఏపీఎంలపై కూటమి ప్రభుత్వ కాలంలో దాడులు చేశారని వైసీపీ నాయకుల ఆరోపణలపై తమకు సంబంధం లేదని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నందిగాం,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):రానున్న పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల ప్రత్యేకాధికారి, డివిజన్ పంచాయతీ అధికారి ఐవీ.రమణ కోరారు. మండలంలోని లఖిదాసుపురం జడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలను అడిగారు. పాఠశాలలో ఏర్పాటు చేయనున్న విద్యుత్‌స్తంభాలు, ఎల్ఈడీ బల్బుల ఏర్పాటును పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారావు, మాజీ సర్పంచ్ ఎం.లోకనాథం, కార్యదర్శి స్వరూప్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై తప్పుడు ఆరోపణలు తగదు

కొత్తూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న కొత్తూరు తహసీల్దార్ కొప్పల బాలకృష్ణపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని, దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చట్ట పరమైన చర్యలు తీసుకొని అరెస్టుచేయాలని దళిత ఉద్యోగ, ప్రజాసంఘాలు కోరాయి. ఈమేరకు సోమ వారం కొత్తూరులో ఆయాసంఘాల నాయకులు తిరుపతిరావు, శిర్ల ప్రసాదరావు, రామక్రిష్ణలు, జమ్మయ్య ఆధ్వర్యంలో ధర్నా, నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ బలదకు చెందిన మహిళ తప్పుడు ఆరోపణలు చేసి భౌతికదాడికి పాల్పడడంతో అరెస్టులు చేయాలనికోరారు. ఈ విషయంపై సమగ్రంగా విచారణ జరిపించి సదరు మహిళతోపాటు మరో ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని కొత్తూరు పోలీసులకు వినతిపత్రాన్ని అందజేశారు.

● పాతపట్నం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న కొత్తూరు తహసీల్దార్‌పై ఇటీవల జరిగిన దాడికి పాతపట్నం తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది సోమవారం నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, గ్రామరెవెన్యూ అధికారులు, గ్రామసర్వేయర్లు, ఆఫీస్ సబార్డినేట్లు పాల్గొన్నారు.


పాతపట్నం: నిరసన తెలుపుతున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

150 మందికి కంటి వైద్య పరీక్షలు

జలుమూరు (సారవకోట), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సారవకోట మండలంలోని బొంతు పీహెచ్‌సీలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా 150 మందికి తనిఖీలు నిర్వహించి 40 మంది రోగులకు కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు అలుదు విజయాంబిక యువజన సంఘం అధ్యక్షుడు చల్ల ఆనందరావు తెలిపారు. కంటి శస్త్రచికిత్సలకు ఎంపికైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి కళ్లద్దాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో చిన్నకిట్టాలపాడు సర్పంచ్ జన్ని సంధ్యారాణి, ఎంపీటీసీ విజయకుమారి, కూటమి నాయకులు బి.కొండయ్య, రామకృష్ణ, గోవిందరావు, గౌరినాయుడు, బొంతు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీజీపీని అరెస్ట్ చేయాలి

టెక్కలి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): హర్యాన డీజీపీని అరెస్టుచేయాలని ఏపీ దళితమహాసభ జిల్లా శాఖ అధ్యక్షుడు బోకరనారాయణరావు డిమాండ్‌చేశారు. సోమవారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ హర్యాన అడిషినల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అధికారి పూరన్ కుమార్ బలవన్మరణానికి బాధ్యులైన డీజీపీ శతృజీత్ సింగ్ కపూర్ రోహతక్, ఎస్పీ నరేంద్రబిజార్నయాలతోపాటు వీరి అనుచరులను అరెస్ట్‌చేయాలని కోరారు.